సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 27 । జూన్ । 2023



హాస్టళ్లు పిలుస్తున్నాయ్

జీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు మెరుగయ్యాయి. చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

- 8లో



జిల్లా క్రికెట్ జట్టు ఖరారు

జిల్లా అండర్-19 క్రికెట్ జట్టును ఖరారు చేశారు. 29 నుంచి అంతర్‌జిల్లాల పోటీలు జరగనున్నాయి.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	34°	25°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	35°	26°
శ్రీకాకుళం	35°	25°

న్యూస్‌రీల్

కుదుటపడిన జెడ్పీ ఛైర్‌పర్సన్ ఆరోగ్యం

అరసవల్లి: ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ ఆరోగ్యం కుదుటపడిందని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని, విశ్రాంతి కోసం విశాఖ వెళ్లారని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రతినిధులు ప్రకటించారు. విశాఖలో ఉన్నత వైద్య సలహాలను తీసుకోవడంతో పాటు నాలుగైదు రోజుల పాటు విశ్రాంతి తీసుకునేందుకు ఆమె నిర్ణయించుకున్నట్లుగా కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

స్పందనకు 252 అర్జీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 252 అర్జీలు స్వీకరించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఉప వైద్య ఆరోగ్య అధికారి అనురాధ, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 33 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్పందనలో ఫిర్యాదు చేసిన బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన గ్రీవెన్స్‌లో 33 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలు పాల్గొన్నారు.

విద్యార్థి నిజాయితీ



ఉప్పాడ సాయికి బహుమతి అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: దారిలో దొరికిన ఖరీదైన సెల్‌ఫోన్ బాధితునికి అందించి ఓ విద్యార్థి తన నిజాయితీ చాటుకున్నాడు. పలాసకు చెందిన లొట్ల మోహన్ జాతీయ రహదారిపై ఉన్న లక్ష్మీపురం టోల్‌ప్లాజాలో పనిచేస్తున్నారు. విధులకు హాజరు కావడానికి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రెడ్డికవీధి మీదుగా ప్రయాణిస్తుండగా రూ.40 వేలు విలువైన సెల్‌ఫోన్ జారిపడిపోయింది. ఈ ఫోన్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఉప్పాడ సాయికి దొరికింది. ఆ ఫోన్ మోహన్‌ది అని తెలుసుకుని అతనికి అప్పగించాడు. దీంతో విద్యార్థిని మోహన్‌తో పాటు స్థానికులు అభినందించారు.

ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెల మూడో శుక్రవారం జిల్లా కలెక్టర్, వివిధ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసిది. ఈ మేరకు ఇక నుంచి ప్రతి నెల మూడో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఉద్యోగులు స్పందన గ్రీవెన్స్‌ను జిల్లాలో నిర్వహించనున్నారు.

యువజనోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'ప్రతిభ మీదయితే ప్రోత్సాహం మాది' అని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం యువజనోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ డిగ్రీ (మహిళా) కళాశాల శ్రీకాకుళంలో ఈ నెల 28న యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత దేశం 2047 అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక /జానపద కళలు వంటి అంశాలపై కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 15–29 ఏళ్ల వయసు ఉన్న యువ ఔత్సాహికులు వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో 492118960 సంప్రదించాలన్నారు. ఇక్కడ గెలిచిన వారు జాతీయ స్థాయికి వెళ్తారని ఎన్‌వైకే కో ఆర్డినేటర్ ఉజ్వల్ తెలిపారు.



చిరునవ్వుల రేవు

ఒకప్పుడు సరుకులతో నావలు వచ్చిన ఆగిన తీరంలో నేడు ప్రగతి వీచికలు వీస్తున్నాయి. రామనవమి, సామూహిక వివాహాలతో ప్రాచుర్యం పొందిన నువ్వలరేవు నేడు అభివృద్ధి పనుల్లో అగ్రపథాన నిలుస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ఇక్కడ మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయి. అదే సందర్భంలో సర్కారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పల్లె రూపురేఖలను మారుస్తున్నాయి. వైఎస్ జగన్ సర్కారు పాలనలో 'పల్లె'విస్తున్న ప్రగతికి నువ్వలరేవు ఓ సాక్షి.

- నువ్వలరేవులో ప్రగతి వీచికలు
- గ్రామంలో 4601 మందికి పలు పథకాల ద్వారా లబ్ధి
- రూ.4.05 కోట్ల వ్యయంతో గ్రామాభివృద్ధి
- గ్రామ సమీపంలో రూ.12 కోట్లతో జెట్టీ నిర్మాణం
- వైఎస్ జగన్ పాలనలో మారిన గ్రామ రూపురేఖలు



నువ్వలరేవు గ్రామం

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవు రూపురేఖలు మారుతున్నాయి. ఐకమత్యంగా ఉంటూ సామూహిక వివాహాలు,శ్రీరామ ఉత్సవాలతో చరిత్రలో నిలిచిన నువ్వలరేవు గ్రామంలో నేడు సంక్షేమ సంబరాలు జరుగుతున్నాయి. ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు రేఖలు ప్రకాశిస్తున్నాయి.

గంగపుత్రులకు గంపెడు సంక్షేమం

గ్రామంలో మెజారిటీ ప్రజల జీవనాధారం చేపలవేట. ఇంటి పెద్దలు చేపల వేట సాగిస్తే వాటిని మహిళలు గ్రామాల్లో తిరిగి విక్రయిస్తుంటారు. ఈ మత్స్యకార గ్రామ వాసులకు మత్స్యకార భరోసా(వేట నిషేధభృతి), 45 ఏళ్లకు మత్స్యకార పింఛన్, ప్రమాద బీమా పెంపు, పెట్రోల్, డీజిల్‌పై రాయితీల పెంపుతో ప్రభుత్వం ఆదుకుంది. వీటికి తోడు అమ్మ ఒడి, చేయూత, చేదోడు, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన, సామాజిక పింఛన్లు, వాహన మిత్ర, వైఎస్సార్ బీమా వంటి సంక్షేమ పథకాలు పేదల కష్టాలను దూరం చేశాయి. గత ప్రభుత్వాల హయాంలో ఇంతలా తమకు సంక్షేమం అందలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు ఎలాంటి చింత లేదని వారు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామానికి ఆనుకుని జెట్టీ నిర్మాణం కూడా పూర్తయితే తమ ఉపాధికి ఢోకా ఉండదని అంటున్నారు.

గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు

- సుమారు రూ.12 కోట్లుతో జెట్టీ నిర్మాణం
- రూ.37 లక్షలతో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

కొత్త భవనాలు..



గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయం

వైఎస్ జగన్ సీఎం అయ్యాక అన్ని గ్రామాల్లో లాగానే ఈ గ్రామంలోనూ కొత్త కొత్త భవనాలు వెలిశాయి. నువ్వలరేవుకు రెండు గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు వచ్చాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలను బాగు చేశారు. ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, రోడ్లతో పాటు రూ.4.05 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. అలాగే గ్రామానికి ఆనుకొని ఉన్న సముద్ర తీరంలో దాదాపుగా మరో రూ.12 కోట్ల వ్యయంతో జెట్టీ నిర్మాణం సాగుతోంది.

- నాడు -నేడు ద్వారా రూ.75 లక్షల వ్యయంతో పాఠశాల అభివృద్ధి.
- రూ.80 లక్షల వ్యయంతో 2 గ్రామ సచివాలయాల నిర్మాణం.
- రూ. 21.80 లక్షల వ్యయంతో ఆర్‌బీకే మంజూరు
- రూ.86 లక్షలతో ఇంటింటికీ మంచి నీటి కుళాయిల ఏర్పాటు.
- శ్మశానంలో భవనం, పలు సీసీ రోడ్ల నిర్మాణం.

మహిళలుగా గర్వపడుతున్నాం



జగనన్న వచ్చిన తర్వాత పథకాల ద్వారా డబ్బులు అందుతున్నాయి. దీంతో మహిళలుగా గర్వ పడుతున్నాం. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. మా పిల్లల చదువు చింత కూడా తీరింది. జగనన్న దయతో భరోసా దొరికింది.

– బైనపల్లి జయశ్రీ, రాజేశ్వరి, బెహరా కుమారి, లబ్ధిదారులు, నువ్వలరేవు

సంతోషంగా ఉంది



గతంతో పోల్చుకుంటే గ్రామంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రభుత్వ బడి చాలా అందంగా అన్ని రకాల సదుపాయాలతో తీర్చిదిద్దారు. కొత్తగా మరి కొన్ని భవన నిర్మాణాలు చేస్తున్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు సహకారం మరువలేనిది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– మువ్వల యజ్ఞా, యువకుడు, నువ్వలరేవు

అందరి సహకారంతో..



ప్రభుత్వం, ప్రజల సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.5 కోట్లు గ్రామానికి మంజూరయ్యాయి.

– ఆదిల్ షా, పంచాయతీ కార్యనిర్వహణాధికారి

సాగర తీరాన సంక్షేమం

జనాభా	లబ్ధిదారులు	కుటుంబాలు	గ్రామ వలంటీర్లు	అమ్మఒడి లబ్ధిదారులు	వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	వైఎస్సార్ సున్న వడ్డీ లబ్ధిదారులు	వైఎస్సార్ చేయూత
7219	4600	2210	36	747	1053	1548	601

అమ్మఒడి లబ్ధిదారులు	వైఎస్సార్ పింఛన్ లబ్ధిదారులు	మత్స్యకార భరోసా	జగనన్న చేదోడు	జగనన్న విద్యా దీవెన	జగనన్న వసతి దీవెన	రైతు భరోసా	వాహన మిత్ర
747	820	383	29	51	83	71	32

వైఎస్సార్ బీమా	ఇళ్లు, స్థలాల లబ్ధిదారులు
31	128

వీటితో పాటు మరి కొన్ని సంక్షేమ పథకాలతో గ్రామంలో 4601 మంది సుమారు రూ.14 కోట్లు లబ్ధిపొందారు.

సంక్షేమం ఇలా..

- వైఎస్సార్ లా నేస్తం నగదు విడుదల
- జిల్లాలో 51 మందికి రూ.12.50 లక్షలు లబ్ధి





లా నేస్తం వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: లాయర్ల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం 'వైఎస్సార్ లా నేస్తం' ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీసులో దీనికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 51 మంది జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ 5.000 చొప్పున ఐదు నెలలకు అందరికీ కలిపి రూ.12.50 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. యువ న్యాయవాదులకు లా నేస్తం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సీఎం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులైన లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు అదిరాయి



ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు అదిరే స్థాయిలో జరుగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో దాదాపు 900 వరకు అడ్మిషన్లు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. జూనియర్ కాలేజీలను నాడు-నేడులో భాగంగా అన్ని వసతులతో తీర్చిదిద్దడం, లెక్చరర్లు చక్కగా బోధిస్తుండడంతో అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని ప్రిన్సిపాల్ కృష్ణవేణి చెప్పారు. ఇప్పటి వరకు ఎంపీసీ గ్రూపునకు 241 దరఖాస్తులు, బైపీసీకి 210 మంది, హెచ్ఈసీకి 112 మంది, సీఈసీకి 119 మంది, ఎంఎల్‌టీకి 119 మంది, సీఎస్‌సీకి 62 మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు 70 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. మరో మూడు అదనపు గదుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశామన్నారు.

'మాదక ద్రవ్యాలపై ఉద్యమిద్దాం'



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని స్పందన హాల్ వద్ద ఆయన ప్రారంభించారు. మాదక ద్రవ్యాలను నిరోధించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనిపై ఎవరి వద్దనైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసు శాఖకు చెప్పాలన్నారు. తల్లిదండ్రులు యువత అలవాట్లపై దృష్టి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

● ట'మోత'



టమాట ధర మోతెక్కిస్తోంది. ప్రస్తుతం బెంగళూరు మార్కెట్ నుంచి సరుకు వస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.80 నుంచి రూ.100 వరకు ఉంది. రైతు బజార్‌లో మాత్రం రూ.60కు విక్రయిస్తున్నారు. పలమనేరు, మదనపల్లి, రాయ్‌పూర్ నుంచి పండ్లు వచ్చినప్పుడు ధర తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

-శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

● అవతార వైభవం



జగన్నాథుడు సోమవారం పరశురామ అవతారంలో దర్శనమిచ్చారు. కవిటి జగన్నాథ ఆలయంలో వేకువ జాము నుంచే పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

-కవిటి

● నేస్తాలొచ్చాయ్..



తొలకరి జల్లులు కురవడంతో మండలంలోని తేలుకుంచి గ్రామంలో విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. సైబీరియా పక్షులు ఈ సీజన్‌లోనే ఇక్కడకు వస్తాయి. ఇప్పుడిప్పుడే వీటి రాక మొదలవుతుంది. ఏటా తొలకరి జల్లులు కురిసే జూన్ నెలలో సైబీరియా నుంచి వచ్చే ఈ పక్షుల అసలు పేరు ఓపెన్ బిల్ స్టార్క్స్ (నత్తగొట్టు కొంగలు, చిల్లు ముక్కు కొంగలు). పగలంతా తంపర భూముల్లో, వరి చేలల్లో తిరుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుంటాయి. ఆరు నెలలు పాటు తమ పిల్లలతో గడిపిన పక్షులు పక్షి పిల్లలు ఎగిరేంత బలం రాగానే డిసెంబర్, జనవరి నెలల్లో తమ ప్రాంతాలకు పయనమవుతుంటాయి.

- ఇచ్ఛాపురం రూరల్



ఫిజియో.. ఫీజు లేదయ్యో..



ఫిజియోథెరపీ కేంద్రంలో బాధితులకు చికిత్స

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ సేవలు
- కాళ్లనొప్పులు, నడుం నొప్పులు, కీళ్లనొప్పులకు చికిత్స
- పక్షవాతం కోసం ప్రత్యేక ట్రీట్‌మెంట్
- ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలతో సేవలు



శ్రీకాకుళం కల్చరల్: కాళ్లు, కీళ్ల నొప్పులు, పక్షవాతంతో బాధ పడుతున్న పేదలకు రెడ్‌క్రాస్ పదేళ్లుగా జిల్లా కేంద్రంలో ఉచితంగా చికిత్స అందజేస్తోంది. జిల్లా కేంద్రంలోని మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం భవనంలో అనేక సేవలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఫిజియోథెరపీ సేవలు చేస్తున్నారు. ఆదివారం మాత్రం సెలవు ఉంటుంది. ఈ కేంద్రం ద్వారా పదేళ్లుగా వేలాది మందికి సేవలు అందించారు.

ఈ కేంద్రం స్థాపించిన నాటి నుంచి 5,789 మందికి ఉచిత సేవలు ఆందించారు. ఇప్పటికీ ప్రతి రోజూ దాదాపు 30 మంది ఇక్కడకు వస్తుంటారు. నడుంనొప్పి, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, జబ్బ నొప్పులు, పాదాల నొప్పులు, పెరాలసిస్ వంటి రోగాలకు మసాజ్‌లు నిర్వహించి, ఫిజియోథెరపీ అందిస్తుంటారు.

ఆధునిక పరికరాలతో..

ప్రైవేటు ఫిజియోథెరపీకి పోటీగా ఇక్కడ కూడా ఆధునిక పరికరాలు సమకూర్చారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మాన్యువల్‌గా చేసుకొనే పరికరాలు ఉన్నాయి. అత్యధునిక ఎలక్ట్రానిక్ పరికరాలైన ఇన్‌ఫ్రారెడ్ ల్యాంప్, ఐఎఫ్‌టీ యూనిట్, ఆల్ట్రా సౌండ్, మజిల్స్ స్టిమ్యులేటర్, ట్రాక్షన్, పరికరాల ద్వారా ఒంటి నొప్పులు, సర్జరీ తర్వాత వచ్చే సమస్యలు, జాయింట్ పెయిన్స్, కండరాల నొప్పులు, నడుంనొప్పులు, మెడ నొప్పులకు ఇవి పనిచేస్తాయి. మాన్యువల్ పుల్లింగ్ ఎక్సర్‌సైజ్, వీల్ ఎక్సర్‌సైజ్, సైకిల్, పాదం ఎక్సర్‌సైజ్, టేబుల్ ఎక్సర్‌సైజ్ పరికరాలతో షోల్డర్ నొప్పులు, ముడుకుల నొప్పులు, పాదం నొప్పులు, పక్షవాతం, కీళ్ల నొప్పులకు ఇవి పనిచేస్తాయి.

ప్రత్యేక ట్రీట్‌మెంట్



పక్షవాతం కోసం ఇక్కడ ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తాం. అలాగే ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారు, మెడికల్‌గా సమస్యలు వచ్చే వారు అంటే మెడనొప్పులు, కాళ్లు, చేతుల నొప్పులు, కీళ్లనొప్పులు ఎక్కువగా ఉన్న వారు వస్తుంటారు. ఎంతో మంది నయం చేసుకొని వెళ్తుంటారు.

– డాక్టర్ కోరాడ లక్ష్మణమూర్తి, ఫిజియోథెరపిస్టు

నా నొప్పులు నయమయ్యాయి



నాకు జబ్బ నొప్పి ఎక్కువగా ఉండేది. చేతులు ఎత్తలేక పోయే వాడిని. ఇక్కడికి గత నెలరోజులుగా వస్తున్నాను. బాగా తగ్గింది.

– బి.యోగేశ్వరరావు, ఇలిసిపురం

ఉచితంగా చేస్తున్నారు



ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు. ముందులో నేను బయట చేయించుకునే వాడిని. డబ్బులు అధికంగా ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం నాకు చాలా బాగా తగ్గింది.

– డి.రవి, గుజరాతీపేట

రెండు నెలలుగా వస్తున్నా

నాకు పెరాలసిస్ వచ్చింది. నాకు కాలు, చెయ్యి పని చేయడంలేదు. రెండు నెలలుగా వస్తున్నాను. బాగా నయమైంది. ప్రస్తుతం బాగుంది.

– పి.గిరి, హడ్కోకాలనీ



భుజం నొప్పి కోసం వీల్ తిప్పుతూ..

రిజర్వేషన్ పితామహుడు

మహారాజ్‌కు ఘన నివాళి


మహారాజ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ 140వ జయంతి కార్యక్రమాన్ని నగరంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్క్‌లోని అతని విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, విగ్రహదాత బుడుమూరు రాజేష్, సంఘ ప్రతినిధులు బి.పి.ఎల్.రావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ కంట వేణు, తిప్పానా గాంధీ, కొనాడ నరసింగరావు, గుత్తు చిన్నారావు, ఇప్పిలి చిన్నారావు, అడపాక రాంబాబు, కె.రంగాజీదేవ్, మైలపల్లి కూర్మారావు తదితరులు మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత సామాజిక ప్రజాస్వామ్య మూలస్తంభం ఛత్రపతి సాహు మహారాజ్ అని కొనియాడారు. దేశ చరిత్రలో దళిత బహుజనులను మనువాదుల నుంచి విముక్తి చేశారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన ఆశయ సాధనను గౌరవించి బీసీ, ఓబీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైమ్: మాదక ద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సం సందర్భంగా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారి చందోలు విజయ నాగమణికంఠ (జేడీ) ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సెబ్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది వారి పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి పోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

వసతి గృహాలు పిలుస్తున్నాయ్..

- బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో భారీగా చేరనున్న విద్యార్థులు


సాంఘిక సంక్షేమ వసతి గృహం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నాడు–నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను కూడా అంతే సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో వీటిల్లో చేరేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. అన్ని వసతులు, హంగులతో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు సిద్ధమయ్యాయి. వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు చేరేందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

సంక్షేమానికి పెద్దపీట

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుతో పాటు, వారు ఉంటున్న భవనాల ఆధునికీకరణ, మెరుగైన సౌకర్యాలు కల్పించింది. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మంచి భోజనం, వసతి సమకూర్చుతున్నారు. మార్పు, నాడు–నేడు పథకాలతో కోట్లాది రూపాయలు వెచ్చించి వసతి గృహాల మరమ్మతులు, భవనాలకు రంగులు, విద్యుద్దీకరణ, ఆధునిక టాయిలెట్లు, రన్నింగ్ వాటర్ వంటి సదుపాయాలు చేకూర్చింది. దీంతో అన్ని కేటగిరీల వసతి గృహాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. విద్యార్థుల ఇంటిని మరిపించేలా వసతి గృహాల రూపురేఖలు మార్చారు.

> **శతశాతం విద్యార్థులు చేరాలి**
>
> వసతి గృహాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయి. అన్ని వసతి గృహాల్లో శతశాతం విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వసతులు పెరిగాయి. మెనూలో కూడా మార్పులు వచ్చాయి. ఎంతో ఆహ్లాదకరంగా వసతి గృహాలు ఉన్నాయి.
>
> –వై.విశ్వమోహన్ రెడ్డి, డీడీ సాంఘిక సంక్షేమ శాఖ, శ్రీకాకుళం

పెరిగిన మెస్ చార్జీలు

విద్యార్థుల మెస్ చార్జీలను సైతం ప్రభుత్వం పెంచింది. గతంలో పోల్చితే 25 శాతం వరకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెరిగాయి. ప్రస్తుతం మూడు నుంచి ఆరు తరగతులకు డైట్ చార్జీలు నెలకు రూ.వెయ్యి, కాస్మోటిక్ చార్జీలు రూ. వంద, ఏడు నుంచి పదో తరగతి వరకు మెస్ చార్జీలు నెలకు రూ.1250, కాస్మోటిక్ చార్జీలు రూ. 125, ఇంటర్ ఆపై తరగతుల వారికి మెస్ చార్జీలు రూ. 1400, కాస్మోటిక్ చార్జీలు 155 రూపాయలు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాలకు సాధారణ బియ్యాన్ని సమకూర్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం పోర్టుఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

- 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ప్రీమెట్రిక్ వసతి గృహాలు 20 ఉన్నాయి. వీటిలో 11 బాలురు, తొమ్మిది బాలికలకు కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 490 మంది విద్యార్థులు ఉండగా.. ఇంకా 310 మంది చేరేందుకు అవకాశం ఉంది.
- సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 11 ఉన్నాయి. వాటిలో బాలురకు ఆరు, బాలికలకు కేటాయించారు. వీటిలో 824 మంది పిల్లలు ఉన్నారు. మరో 409 మంది చేరవచ్చు.
- బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 63 ఉన్నాయి. వీటిలో బాలురు 53, బాలికలకు పది కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 4,836 మంది విద్యార్థులు ఉండగా.. మరో రెండు వేల మంది చేరనున్నారు.
- బీసీ పోస్టుమెట్రిక్ 18 వసతి గృహాలు ఉండగా.. వీటిలో బాలురుకి ఎనిమిది, బాలికలకు పది కేటాయించారు. వీటిలో ప్రస్తుతం 2,453 మంది ఉండగా.. మరో వెయ్యి మంది చేరవచ్చు. ఈ వసతి గృహాల్లో పిల్లలు చేరాలంటే కళాశాలలు పూర్తిస్థాయిలో ప్రారంభం కావాల్సి ఉంది.

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం


నీలాపు లోకేష్ మృతదేహం

ఇచ్ఛాపురం: రైలు ఢీకొని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన పట్టణంలోని పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు కొట్టడంతో కేదారిపురం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు నీలాపు లోకేష్ (24) మృతి చెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు. లోకేష్ రోజూ సాయంత్రం వేళ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుంటాడు. ఆదివారం కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగి వచ్చే క్రమంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో చనిపోయి ఉండవచ్చునని జీఆర్‌పీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆస్పత్రికి తరలించి జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్‌లో జగన్నాథపురం వాసి మృతి


అప్పారావు (ఫైల్)

సంతబొమ్మాళి: జగన్నాథపురం గ్రామానికి చెందిన సిమెన్ అడ్డ అప్పారావు (38) దుబాయ్‌లో షిప్‌లో పని చేస్తూ అనారోగ్యం కారణంతో మృతి చెందాడు. ఈ మేరకు షిప్ యాజమాన్యం కుటుంబ సభ్యులకు సోమవారం సమాచారం అందించారు. అప్పారావు ఐదేళ్లుగా సీమెన్‌గా పని చేస్తున్నారు. ఆకస్మికంగా చనిపోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతునికి భార్య గాయత్రి, ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు, తండ్రి తాతారావు ఉన్నారు. అప్పారావు మృతితో జగన్నాథపురంలో విషాదం నెలకొంది.

వాహన్ సర్వీసులో రవాణా కార్యకలాపాలు

శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు ఫిట్నెస్ సంబంధిత కార్యకలాపాలు ఈ ప్రగతి సర్వీసు నుంచి కాకుండా వాహన్ సర్వీసులో మాత్రమే త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని జిల్లా ఉపరవాణాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి వాహనదారులంతా వాహన్ సర్వీసు ద్వారా రవాణా శాఖా పనులు చేసుకోవాలని సూచించారు.

పెన్‌కాక్ సిలాట్ స్టేట్‌మీట్‌లో సిక్కోలు హవా


పతకాలు సాధించిన పెన్‌కాక్ సిలాట్ క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్ (మార్షల్ ఆర్ట్స్) క్రీడా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు హవా కనబర్చారు. చిత్తూరు జిల్లా పుత్తూరు వేదికగా ఈనెల 25, 26వ తేదీల్లో ఎనిమిదో ఏపీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ బాలబాలికల పెన్‌కాక్‌సిలాట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా.. శ్రీకాకుళం చెందిన క్రీడాకారులు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 13 మంది పతకాలు సాధించారు. పదిమంది బంగారు, మరో ముగ్గురు రజత పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది ఆగస్టు నెలలో కేరళలో జరిగే సౌత్‌జోన్ నేషనల్స్ పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలకు నేరుగా ఎంపికై నట్టయింది. ఇదిలా ఉండగా క్రీడాకారులు రాణింపుపై పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేగిడి దయామయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్‌నాయుడు సంతోషం వ్యక్తం చేశారు.

పతకాలు సాధించింది వీరే..

వివిధ కేటగిరీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బడారి ప్రణవి, రెడ్డి జ్ఞానంచంద్, ఎస్.రేవంత్ సూర్య, జూనియర్స్ విభాగంలో పి.వంశీకృష్ణ, చిట్టూరి పవన్ సాయిగణేష్, లంక లతీష్ చైతన్య, మామిడి పవన్ సాయి, సీనియర్స్ విభాగంలో నేతింటి నాగమణి, నేతింటి ఇంద్రజ, నక్క లక్ష్మణ్ నాయుడు బంగారు పతకాలు సాధించగా.. కె.హరీష్, ఎం.చైతన్య, జి.రామ్మోహన్‌రావు రజిత పతకాలతో మెరిశారు.

డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. డీఈవో తిరుమల చైతన్య నిర్లక్ష్య వైఖరిపై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు నేతృత్వంలో ఎస్.రమణమ్మ, డి.శివజ్యోతిషేక్‌మునిలు జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదించిన 12 మంది మెడికల్ ప్రిఫెరెన్షియల్ పరిగణించకపోవడం, ఆరుగురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా రీకౌన్సెలింగ్ జరపడం వల్ల 250 మంది సీనియర్లకు నష్టం జరిగిందని వివరించారు. ఎంటైటిల్మెంట్ పాయింట్ల కేటాయింపులో ఎనిమిదేళ్లు పూర్తి కాకముందే కొందరు మహిళా ఉపాధ్యాయులకు స్పౌజ్ పాయింట్లు కేటాయించడంలో స్వయంగా డీఈవోనే ప్రత్యేక శ్రద్ధ చూపడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉత్తర్వులు పూర్తిగా ఉల్లంఘిస్తూ పోస్టులు పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కసరత్తు అస్తవ్యస్తం చేయడం వల్ల బదిలీల ప్రక్రియ పూర్తయి మూడు వారాలు కావస్తున్నా పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు పట్టుకొని ఏ స్కూల్‌కి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. ముగ్గురు విద్యార్థులు ఉన్న పలాస మండలం వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలకు రెండో పోస్టు కేటాయించి, పోలాకి మండలం గుప్పెడుపేట ఒకటి, రెండు తరగతుల్లో 52 మంది విద్యార్థులకు రెండో పోస్ట్ ఇవ్వకపోవడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించకపోతే డీఈవో వైఖరిని నిరసిస్తూ ప్రత్యక్ష కార్యచరణ రూపొందిస్తామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తూరు: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మండలంలోని బలద గ్రామానికి చెందిన చౌదరి మణికంఠ (23) మల్టీ మీడియా కోర్స్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తుండేవాడు. అయితే కంపెనీని త్వరలో మూసివేయనున్నట్టు యాజమాన్యం నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ నెల 23వ తేదీన మణికంఠ హైదరాబాద్ నుంచి బలద గ్రామానికి చేరుకున్నాడు. కంపెనీ మూత పడుతున్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి బాధపడ్డాడు. తీవ్ర మనస్తాపంతో ఉన్న మణికంఠ 24వ తేదీ రాత్రి భోజనం చేసిన తన టెర్రేస్‌కు వెళ్లి అప్పటికే సిద్ధంగా తెచ్చిఉంచుకున్న పురుగు మందు తాగి స్పృహతప్పి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 25వ తేదీ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ఎం.గోవిందరావు చెప్పారు. తల్లి సాయిభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏడాది క్రితం పెద్ద కుమారుడు..


మణికంఠ (ఫైల్)

చౌదరి సాయిభవాని, శ్యామ్‌లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తెకు వివాహమైంది. పెద్ద కుమారుడు మాధవ్ గత ఏడాది జూలై 13న ఇంటివద్దే పరుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందంగా లేకపోవడంతో పెళ్లి జరగదనే భయంతో మనస్తాపం చెంది మాధవ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇప్పుడు రెండో కుమారుడు మణికంఠ కూడా బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర వన్డే క్రికెట్ జట్టు ఖరారైంది. 15 మందితో తుది జట్టు, మరో ఆరుగురు స్టాండ్‌బైతో కూడిన జాబితాను శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల వైఎస్ శాస్త్రి, హసన్ రాజ వెల్లడించారు. తగరపువలసలోని ఓ క్రికెట్ అకాడమీలో శిక్షణ శిబిరాలు, సెలక్షన్ మ్యాచ్‌లు ఇటీవల నిర్వహించిన అనంతరం తుది జట్టును ఎంపిక చేసినట్టు చెప్పారు.

29 నుంచి అంతర్‌జిల్లాల పోరు

ఈనెల 29వ తేదీ నుంచి విజయనగరం జిల్లా వేదికగా ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-19 బాలుర వన్డే క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రికెట్‌జట్టు ఈనెల 28వ తేదీన ఇక్కడ నుంచి పయనమై వెళ్లనుంది. ఎంపికైన క్రీడాకారులంతా తమ లగేజిని సిద్ధం చేసుకోవాలని పుల్లెల శాస్త్రి, హసన్‌రాజ తెలిపారు.

జిల్లా జట్టు వివరాలు:

డీవీవీ శ్రీరాం (కెప్టెన్), ప్రదియున్‌సాయి (వైస్ కెప్టెన్), సుశాంత్, గణేష్‌సాయి, థామస్ (వికెట్ కీపర్), అజయ్ (వికెట్ కీపర్), సిద్ధాంత్, మోహన్‌రిషి, రోహిత్, సిద్ధూ విఘ్నేశ్, ఎం.పూర్ణచంద్ర, పి.సతీష్, అవినాష్, వెంకటసాయి, సాయిసృజన్. స్టాండ్‌బైగా జైరామ్, రుషికేషి, రాము, యువరాజు, కృష్ణ, అభిషేక్ ఎంపికయ్యారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,180–00
బంగారం(22కి. 10గ్రా.)	54,350–00
వెండి (కిలో)	75,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹270	₹ 280